www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 25 డిసెంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-219 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak







## ఆదానీ,అంబానీల జేబు సర్కార్



వారి కనుసన్నల్లోనే దేశ పాలన • మోడీ ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు

ఢిల్లీ ఎర్రకోట వద్ద కాంగ్రెస్ సభ • పాల్గోన్న నటుడు కమలహాసన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (సమ సమాజం):** కేంద్రంలో ఉన్నది మోడీ సర్కార్ కాదని.. అది అంబానీ,అదానీల సర్కార్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆ వ్యాపారవేత్తల జేబులోనే కేంద్ర ప్రభుత్వం ఉందని.. వారి కనుసన్నల్లోనే దేశ పాలన నడుస్తోందని మండిపడ్డారు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన ఈసందర్భంగా విరుచుకుపడ్డారు. దేశంలోని 90 శాతం మంది ప్రజలు ఏకత్వాన్ని ఇష్టపడతారు. నాకు భారత్ జోడో యాత్రలో ఇదే విషయం తెలిసింది. అతికొద్ది మంది మాత్రమే దేశ వాతావరణాన్ని చెడగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటిదాకా నేను దేశంలో 2800 కిలోమీటర్లు నడిచాను. ఎక్కడ కూడా ద్వేషం కానీ.. హింస కానీ కనిపించలేదు. కానీ బీజేపీకి వంతపాడే మీడియా ఛానళ్లు 24 గంటల పాటు మతపరమైన అంశాలు, విద్వేషం రెచ్చగొట్టే వార్తలనే చూపిస్తున్నారు. ఇది మీడియా విలువలకు విరుద్ధం అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రజల ఆసక్తిని మతపరమైన అంశాలపైకి మరల్చి.. సామాన్యుల జేబుకు చిల్లు పెట్టే పనిని కేంద్ర

3లో


## రాష్ట్రపతి ముర్ముకు స్వాగత ఏర్పాట్లు

దండార్ నృత్యంతో స్వాగతించనున్న గిరిజనులు



**హైదరాబాద్, డిసెంబర్ 24 (సమ సమాజం):** ఈ నెల 26న నగరానికి రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గిరిజనుల్లోని కోలాం తెగ తమ 'దండార్' నృత్యంతో స్వాగతం పలకనుంది. 27న రాష్ట్రపతి నిలయమైన బొల్లారంలో స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు

3లో



ప్రధాని మోడీ తీవ్ర దిగ్భ్రాంతి

## ఇటుకబట్టీ పేలుడులో 9మంది మృతి

**పాట్నా, డిసెంబర్ 24 (సమ సమాజం):** బిహార్ లో ఘోర ప్రమాదం జరిగింది. తూర్పు చంపారణ్ జిల్లాలోని నారీగిర్ గ్రామంలో ఓ ఇటుక బట్టీకి చెందిన ఎత్తైన చిమ్నీ పేలిపోయింది. ఈ ఘటనలో 9మంది కార్మికులు మృతి చెందారు. 10 మందికిపైగా గాయపడ్డారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు, పోలీసు బలగాల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన వారికి హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు. ఇటుక బట్టీ యజమాని కూడా ప్రమాదంలో చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ, బిహార్ సీఎం నితీశ్ కుమార్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రెండు లక్షలు, గాయపడిన వారికి 50 వేల పరిహారం ప్రకటించారు.



# కేంద్రం విధానాల వల్లనే జీతాలు ఆలస్యం

## కేంద్రం ఏక పక్షంగా 40 వేల కోట్లకు కోత



నిధులు విడుదలలో కేంద్రం నిర్లక్ష్యం

విద్యాశాఖ ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తాం

ఎస్టీయూ సమావేశంలో మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, డిసెంబర్ 24 (సమ సమాజం):** రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హరీష్ రావు తెలిపారు. ఉద్యోగుల విషయంలో మాది ఫ్రెండ్లీ ప్రభుత్వమని అన్నారు. హైదరాబాద్ వనస్థలిపురంలో నిర్వహించిన ఎస్టీయు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రం వివక్షత కారణంగానే ఉపాధ్యాయులకు జీతాల చెల్లింపులో ఆలస్యం జరుగుతుందని మంత్రి వివరించారు. విద్యాశాఖలోని ఖాళీలన్నింటిని భర్తీ చేస్తామని హరీష్ రావు పేర్కొన్నారు. ప్రమోషన్లు, బదిలీల విషయంలో సిఎం కెసిఆర్ సానుకూలంగా ఉన్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మొదటి సారి 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని, 11వ వేతన సవరణ ద్వారా 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించామని మంత్రి తెలిపారు. మన పక్కన ఉన్న ఎపి ప్రభుత్వం కంటే ఇది ఎక్కువ వేతనం అని అన్నారు. ఒకటో తారిఖు జీతం రాకపోవడానికి కరోనా ఎఫెక్ట్, కేంద్ర సహాయ నిరాకరణ వల్ల కొంత ఆర్థిక ఇబ్బందులే కారణమని, కావాలనే కేంద్ర ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని హరీష్ రావు స్పష్టం చేశారు. కేంద్రం ఏకపక్షంగా 40 వేల

3లో

## సిరిసిల్లలో అధికార పార్టీ బిఆర్ఎస్‌కు షాక్

పార్టీకి రాజీనామా చేసిన వార్డు కౌన్సిలర్ పత్తిపాక పద్మ

అనేక అవమానాలు ఎదుర్కొన్నానని వీడియో సందేశం



**రాజన్నసిరిసిల్ల, డిసెంబర్ 24 (సమ సమాజం):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన 26 వార్డు కౌన్సిలర్ పత్తిపాక పద్మ రాజీనామా చేశారు. టీఆర్ఎస్ పార్టీలో సుదీర్ఘ కాలం పాటు పని చేసిన ఆమె అవమానాలు భరించలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ పార్టీకి గుడ్ బై ప్రకటించారు. తెలంగాణ ఆవిర్భావ సమయం నుంచి పార్టీలో చేరి

3లో

## శ్రీకృష్ణ జన్మస్థానంపై పిటీషన్

షాహీ ఈద్గాలో సర్వే చేయాలన్న స్థానిక కోర్టు

**లక్నో, డిసెంబర్ 24 (సమ సమాజం):** ఉత్తరప్రదేశ్ లోని మధురలో ఉన్న షాహీ ఈద్గా మసీదును సర్వే

3లో

## క్రిస్మస్‌కు ముస్తాబైన మెదక్ చర్చి విద్యుద్దీపాలతో ధగధగలు




**మెదక్, డిసెంబర్ 24 (సమ సమాజం):** ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన, అత్యుత్తమ కట్టడాల్లో ఒక్కటైన మెదక్ సీఎస్ఐ చర్చి క్రిస్మస్ శోభను సంతరించుకున్నది. విదద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులు చర్చిలో ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రిస్మస్ వేడుకలను కనుల విందుగా జరిపేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసారు. చర్చిని విద్యుత్‌దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేసారు. 25న

3లో

## కొత్త వేరియంట్ బీఎఫ్-7 దడ


న్యూ ఇయర్ వేడుకలపై ప్రభావం



**హైదరాబాద్, డిసెంబర్ 24 (సమ సమాజం):** ఏటా డిసెంబర్ 31 వచ్చిందంటే న్యూ ఇయర్ వేడుకల సందడి జోరుగా ఉండేది. తాజా పరిస్థితుల నేపథ్యంలో కొత్త సంవత్సర వేడుకల కళ పూర్తిగా తప్పుతుందనే చెప్పాలి. మందుబాబులకు మళ్లీ నిరాశే ఎదురు కానుంది. సెలబ్రిటీలు,నటులతో ప్రత్యేక కార్యక్రమాలు.. డీజే సౌండ్లతో యువత డ్యాన్సులు.. కేకుల సందడి,యువత కేరింతలకు ఇక పెద్దగా అవకాశం లేదనే భావించాలి. డిసెంబర్ 31 దగ్గర పడుతున్నా ఎక్కడా ఆ జోష్ కనిపించడం లేదు. ఈపాటికే స్టార్ హోటళ్లు.. ఈవెంట్లు సంస్థలు అర్ధరాత్రి కొత్త సంవత్సర వేడుకలకు రకరకాల ప్యాకేజీలు, ఆఫర్లతో బుకింగ్‌లు మొదలు పెట్టయి. విందులు, వినోద ఈవెంట్లతో సందడి చేసేందుకు రంగం సిద్ధం చేశారు. . కానీ సరిగ్గా కొత్త సంవత్సరం ప్రారంభానికి మరో

3లో

## శబరిమల యాత్రలో విషాదం



3లో

అర్ధరాత్రి లోయలోపడ్డ వాహనం

8మంది అయ్యప్ప భక్తుల దుర్మరణం

భక్తులంతా తమిళనాడు వాసులగు గుర్తింపు

సహాయక చర్యల చేపట్టిన కేరళ పోలీసులు

## అజాత శత్రువు ..నిస్వార్థరాజకీయ నేత

♦భారత రాజకీయాల్లో అరుదైన నాయకుడు ♦అద్భుత వాక్చాతుర్యం ఆయన సొంతం

♦వాజ్‌పాయ్ జయంతి సందర్భంగా నేడు సుపరిపాలనా దినోత్సవం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 24 (సమ సమాజం): .** భారత రాజకీయాల్లో అజాత శత్రువుగా పేరుగాంచిన అనన్య సామాన్యుడు దివంగత వాజ్‌పేయి. ఆయననిస్వార్థ రాజకీయ దురంధురుడు. 1924 డిసెంబర్ 25న మధ్యప్రదేశ్ లోని గ్వాలియర్లో జన్మించిన అటల్ బిహారీ వాజ్‌పేయి భారతీయ జనతా పార్టీ తరపున ప్రధాన మంత్రి పదవిని పొందిన తొలి నాయకుడు. కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన చేసిన కాలంలో అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. అటల్ బిహారీ వాజపేయి ఆజన్మ బ్రహ్మచారి. భారత రాజకీయాల్లో ఆజాత శత్రువుగా, నిరాడబంరునిగా జీవించిన అరుదైన వ్యక్తి స్వర్గీయ ప్రధాని అట్‌బిహారీ వాజ్‌పేయ్. వాజ్‌పేయ్ పేరు లేకుండా భారత రాజకీయాల పరిణామ క్రమాన్ని చూడలేం. భారతదేశానికి ప్రధానిగా పనిచేసిన వారిలో అందరికన్నా దేశంలో సరికొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టారు.

3లో

## మేడ్చెల్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్

పోలీసులను అడ్డుకుని దుర్భాషలాడిన బిఆర్ఎస్ నేత

**హైదరాబాద్, డిసెంబర్ 24 (సమ సమాజం):** మేడ్చల్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులపై అధికార బిఆర్ఎస్‌కు చెందిన ఎనిమిదో వార్డు కౌన్సిలర్ దౌర్జన్యం చేశాడు. నాగరాజు అలియాస్ చాపరాజు సీఎం నియోజకవర్గంలోని మనోరాబాద్ ఎంపీపీని అంటూ మరో వ్యక్తి పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు అయితే ఏం చేస్తారని అంటూ మనోహరాబాద్ ఎంపీపీ భర్త రవి, మేడ్చల్ కౌన్సిలర్ చాపరాజు, రామాయపల్లి ఎంపిపి మరిది శ్రీనివాస్ గౌడ్ బెదిరింపులకు దిగారు. ఈ తతంగం అంతా వీడియో తీస్తున్న సబ్ ఇన్ స్పెక్టర్ ఫోన్ ని లాక్కుని

3లో

## సంపాదకీయం

# మరోమారు కరోనా హెచ్చరికలు !

కరోనా ముప్పు తొలగిపోలేదని తాజా ఘటనలతో మరోమారు రుజువు అవుతోంది. కొత్త వైరస్ చైనాను, అమెరికాతో పాటు పలు దేశాలను వణికిస్తోంది. దీంతో మనదేశం కూడా అప్రమత్తం కాక తప్పలేదు. ప్రజలకు మళ్లీ హెచ్చరికలు చేయకా తప్పలేదు. ఈ హెచ్చరికల నేపథ్యంలో మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, జాగ్రత్తలు పాటించడం మళ్లీ అలవాటుచేసుకోవాల్సిందే. వాతావరణ మార్పుల కారణంగా కూడా అనేక రుగ్మతలు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర మార్గదర్శకాల నేపథ్యంలో మళ్లీ ఆంక్షల్లోకి వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆంక్షలు విధించాయి. విమానాశ్రయాల్లో కరోనా నెగెటివ్ రిపోర్టును కేంద్రం తప్పనిసరి చేసింది. దీంతో వరుసగా వస్తున్న క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండగల సందర్భంగా ఒకేచోట వేల మంది గుమి గూడే పరిస్థితి ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు సూచిస్తున్నాయి. ఈ మేరకు కేంద్రం కూడా ఆయా రాష్ట్రాలకు సూచించింది. ఈ క్రమంలో ఇక పండగల వేళ మళ్లీ సందడి లేకుండా పోయే రోజులు వచ్చాయన్న ఆందోళన సమజంగానే కలుగుతోంది. అయితే మన జాగ్రత్తలో మనం ఉంటూ ముందుకు సాగడం ద్వారా కొత్త వైరస్ వ్యాప్తిని అరికట్టాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతిపైనా దీని ప్రభావం పడనుంది. అంతకు ముందే న్యూ ఇయర్ వేడుకలపైనా ప్రభావం చూప నుంది. మొత్తంగా న్యూ ఇయర్ వేడుకల నిర్వహణకు అవకాశం ఉండకపోవచ్చు. గతేడాది కూడా ఇలాంటి పరిస్థితే వచ్చింది. దీంతో క్రిస్మస్, న్యూఇయర్ వేడుకలపై తీవ్ర ప్రభావం పడింది. ఇది ఓ రకంగా చిన్న వ్యాపారులకు తీరని దెబ్బ. పండగల వేళ ఆంక్షలతో వ్యాపారాలు దెబ్బతినగలదన్న ఆందోళనా వస్తోంది. ఇప్పటికే కరోనా నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశించింది. రాహుల్ జోడో యాత్రను ఆపాలని కూడా సూచించింది. కోవిడ్ మార్గదర్శకాలను ఎప్పటి కప్పుడు పాటించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో ప్రధాని, కేంద్రమంత్రి వరుస సమీక్షలు నిర్వహించి అన్ని రాష్ట్రాలతో చర్చలు జరిపారు. కేంద్ర మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించడంతో వైరస్ తీవ్రత ను అర్థం చేసుకోవాలి. ప్రపంచ దేశాల్లో వైరస్ తీవ్రతను అధ్యయనం చేస్తున్నామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మంత్రిమన్సైక్ మాండవీయ తెలిపారు. కోవిడ్ నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పర్యవేక్షిస్తామని తెలిపారు.కొత్త వేరియంట్ విజృంభిస్తున్ననందున ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

విమానాశ్రయాల్లో కోవిడ్ టెస్టులు జరపాలని, ఇతర జాగ్రత్తలు పాటించాలని చెప్పింది. పండుగలకు పెద్ద ఎత్తున జనం గ్రామాలకు వెళ్లే అవకాశం ఉన్నందున ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని ఆదేశించింది. గ్రామాలకు వెళ్లేవారు జగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పరోక్షంగా చెప్పింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రజలు నడుచుకోక తప్పదు. ఈ క్రమంలో ఇప్పటికే అనేక రాష్ట్రాలు ఆర్టీపీఎస్ పరీక్షలకు రంగం సిద్ధం చేసాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాలు కోవిడ్ నిబంధనల మేరకు చర్యలకు ఉపక్రమించాయి. అయితే ప్రస్తుతం ప్రపంచ ప్రజలందరూ చర్చించుకుంటున్న కోవిడ్ 19 బీఎఫ్-7 వేరియంట్ పాతదేనని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. దాదాపు ఆరు నెలలుగా ఈ వేరియంట్ మనుగడలో ఉన్నదని అంటున్నారు. అంతేకాక ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఈ ఏడాది జూలైలోనే బీఎఫ్-7 వేరియంట్‌ను శాస్త్రవేత్తలు అధికారికంగా గుర్తించారని చెబుతున్నారు. సాంకేతికంగా బీఎఫ్-7గా నామకరణం చేసిన బీఏ.5.2.17 వేరియంట్ ఇప్పటికే 50కిపైగా దేశాల్లో వ్యాపించి ఉంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా చేసిన జీనోమ్

సీక్వెన్సింగ్‌లో దాదాపు 50 వేల శాంపిళ్లలో ఈ వేరియంట్‌ను గుర్తించినట్టు నిపుణులు చెబుతున్నారు. మన దగ్గర బీఎఫ్-7 వేరియంట్ ఇప్పటికే మనుగడలో ఉన్నది. కానీ కేసుల సంఖ్యలో పెద్దగా మార్పు కనిపించలేదు. కాబట్టి మనం భయపడాల్సిన అవసరం లేదని కూడా అంటున్నారు. ఇకపోతే దేశంలో ఇప్పటికే 90 శాతానికిపైగా రెండు వ్యాక్సిన్ డోసులు తీసుకున్నారు. అందులో దాదాపు 90 శాతం మంది కొవిడ్ బారిన పడ్డారు. తద్వారా వారిలోని సహజ రోగనిరోధక శక్తి పెరిగింది. ఇలా మనదేశంలో హైబ్రిడ్ ఇమ్యూనిటీ ఉన్నందున కొత్త వేరియంట్లు పెద్దగా ప్రభావం చూపడం లేదని పేర్కొన్నారు. అయినా అప్రమత్తంగా ఉండడం మంచిదని సూచిస్తున్నారు. ఇకపోతే మొత్తంగా ఇప్పుడు చైనాలోని తాజా పరిస్థితులను చూస్తుంటే మూడో ముప్పు కళ్లముందే కనిపిస్తోంది. విందులు.. వినోదాలు..ఆటపాటల్లో జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. మొత్తంగా కొవిడ్ భయం మరోసారి వచ్చేస్తోంది. చైనాలో తీవ్ర రూపం దాల్చిన మేరకు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం చేసిన విషయం తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశప్రజలకు కొవిడ్ పట్ల జాగ్రత్తలు అవసరమేనని సూచించిన వెంటనే వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక నిబంధనలు జారీ చేసింది. ప్రతి చోటా మాస్కులు తప్పనిసరిగా వాడటం ఉత్తమమని సూచిస్తున్నారు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# భారతీయ గురుకుల విద్య ప్రపంచానికి ఆదర్శం

### స్వామినారాయణ గురుకుల్ అమృత్ మహోత్సవంలో మోడీ





న్యూఢిల్లీ,డిసెంబర్24(సమసమాజం): భారత గురుకుల విద్యా సంప్రదాయం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 2014 తర్వాత వైద్య కాలేజీల సంఖ్య 65శాతానికి పైగా పెరిగిందన్నారు. కొత్త జాతీయ విద్యావిధానం ద్వారా.. మెరుగైన విద్య అందుతుందని చెప్పారు. శ్రీ స్వామినారాయణ గురుకుల్ రాజ్ కోట్ సంస్థాన్ 75వ అమృత్ మహోత్సవంలో.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మోడీ ప్రసంగించారు. స్వామినారాయణ గురుకుల్ సంస్థ భవిష్యత్ మరింత ఉజ్వలంగా ఉండాలని ఆశిస్తున్నానన్నారు. ఇస్రో నుండి షార్క్ వరకు గురుకులాలకు చెందిన వారసత్వమే ఉందని ప్రధాని మోడీ అన్నారు. వీరు దేశం యొక్క ప్రతిభను శక్తివంతం చేశారన్నారు. పేద విద్యార్థులకు సహాయం చేస్తున్నందుకు గురుకులంపై మోడీ ప్రశంసలు కురిపించారు. పేద విద్యార్థుల విద్యను పూర్తి చేయడానికి గురుకులం రోజుకు ఒక రూపాయి వసూలు చేస్తుందని అన్నారు. దీనివల్ల పేద విద్యార్థులు చదువుకో గలుగుతున్నారని చెప్పారు. నలంద, తక్షశిల వంటి పురాతన విశ్వవిద్యాలయాల వారసత్వాన్ని మోడీ గుర్తుచేశారు. ప్రాచీన కాలం నాటి గురుకులాల వైభవం, మహిమ, వైభవానికి ఈ సంస్థలు ఉదాహరణలు అని అన్నారు. గార్గి, మైత్రేయి వంటి మహిళా సాధువులు చేసిన సేవలను కూడా ఆయన గుర్తు చేసుకుంటూ, 'లింగ సమానత్వం వంటి పదాలు పుట్టకపోయినప్పటికీ, గార్గి , మైత్రేయి వంటి మన సాధువులు శాస్త్రాలను అధ్యయనం చేసేవారని చెప్పారు.

# బల్దియా బడ్జెట్‌కు ఏకపక్ష ఆమోదం



### చర్చ లేకుండానేఆమోదించిన మేయర్

### సమావేశం వాయిదాపై మండిపడ్డ బిజెపి

హైదరాబాద్,డిసెంబర్24(సమసమాజం): బడ్జెట్ పై ఎలాంటి చర్చ లేకుండానే జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశం ముగిసింది. అనతంరం సమావేశాన్ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వాయిదా వేశారు. బడ్జెట్ ఆమోదం అయిపోయిందని..స్టాండింగ్ కమిటీ ఆమోదం కూడా పొందిందని చెప్పారు. అంతకముందు విపక్ష సభ్యులు పోడియం దగ్గరికి నిరన తెలపడంపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్దియాలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కావడం లేదని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. కాంట్రాక్టర్ల కాళ్లు మొక్కినా పనులు కావడం లేదన్నారు. సభ ప్రారంభమైన వెంటనే బీజేపీ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. సిటీలోని సమస్యలపై నిలదీశారు. మేయర్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కాంట్రాక్టర్ల కాళ్లు మొక్కినా పనులు కావడం లేదని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు. మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి నిరసన తెలిపారు. టేబుల్స్ ఎక్కి నిరసన తెలిపారు. దీంతో మేయర్ బెంచీలు దిగాలని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సభ్యులను బయటకు పంపాలని మార్షల్స్ ను ఆదేశించారు. చర్చా సమయం వృథా చేయకుండా అందరూ సంయమనం పాటించాలని మేయర్ విజయలక్ష్మి కోరారు. చర్చలు జరగాలి అనుకుంటే సహకరించా లన్నారు. మేయర్ పోడియం దగ్గరకు రావడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్పొరేటర్ల కు ఎలాంటి సమస్యలు దొరకడం లేదు కాబట్టి ముందస్తు ప్లాన్‌తో వచ్చారని ఆమె ఆరోపించారు. తాము ఎజెండాను అందరూ కార్పొరేటర్లకు ముందుగానే పంపించామని.. అప్పుడు మాట్లాడాల్సి ఉండేదని చెప్పారు. ఇప్పుడు బడ్జెట్ ఆమోదం పొందిందని తెలిపారు. రూ.6,224 కోట్ల బ్జడెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని మేయర్ విజయలక్ష్మిచెప్పారు.

# ఢిల్లీకి చేరుకున్న రాహుల్ జోడోయాత్ర

- హర్యానా సరిహద్దుల్లో స్వాగతించిన నేతలు
- యాత్రలో పాల్గొన్న సోనియా, ప్రియాంకలు



న్యూఢిల్లీ,డిసెంబర్24(సమసమాజం):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఢిల్లీలోకి ప్రవేశించింది. హర్యానాలోని బదర్‌పూర్ సరిహద్దు నుంచి ఢిల్లీలోకి ప్రవేశించింది. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ అనిల్ చౌదరి, పార్టీ కార్యకర్తలు రాహుల్ గాంధీకి బదర్ పూర్ సరిహద్దు వద్ద ఘన స్వాగతం పలికారు. రాహుల్ వెంట హర్యానా మాజీ సీఎం భూపిందర్ సింగ్, కుమారి సెల్జా, రణదీప్ సూర్జేవాలా కూడా ఉన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాదయాత్ర.. దేశరాజధాని ఢిల్లీలో ఉత్సాహంగా కొనసాగుతోంది. కార్యకర్తలు, నేతలు పెద్దఎత్తున రాహుల్‌తో కలసి నడిచారు.సోనియా, ప్రియాంక గాంధీ, రాబర్ట్ వాద్రా జోడోయాత్రలో పాల్గొన్నారు. ఢిల్లీ వీధుల్లో కిక్కిరిసిపోయే జన సందోహం మధ్య రాహుల్ పాదయాత్ర సాగింది. ఇక ఢిల్లీలోని ఎర్రకోట వరకు రాహుల్ యాత్ర సాగింది. పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ ప్రసంగించారు. కొంతమంది ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని.. కానీ దేశంలోని సామాన్యులు ఇప్పుడు ప్రేమ గురించి మాట్లాడుతున్నారన్నారు. ప్రతి రాష్ట్రంలో లక్షలాది మంది యాత్రలో చేరారని చెప్పారు. మీ ద్వేషపూరిత బజార్‌లో ప్రేమ దుకాణం తెరవడానికే తాము ఇక్కడికి వచ్చామని ఆర్ఎస్ఎస్ ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. ఈ ఉదయం 11 గంటలకు దేశ రాజధానిలో ఆశ్రమ చౌక్ వద్ద రాహుల్ యాత్ర ముగిసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు మళ్లీ ప్రారంభం అయ్యింది. మధుర రహదారి, ఇండియా గేట్, గుండా ప్రయాణించిన తర్వాత, ఎర్రకోట దగ్గర ఇవాళ్టి యాత్ర ముగించారు.. రాహుల్ యాత్ర కారణంగా ఢిల్లీ పోలీసులు ట్రాఫిక్ ఏర్పడే అవకాశం ఉందని ప్రకటించారు. బదర్‌పూర్ నుండి ఎర్రకోట వరకు ట్రాఫిక్ భారీగా ఉండవచ్చని సూచించారు. రాహుల్ యాత్ర సమయంలో అటు వైపు ప్రయాణాలు పెట్టుకోవద్దని పోలీసులు ముందే సూచించారు. ఇక డిసెంబర్ 16 నాటికి రాహుల్ జోడో యాత్ర 100 రోజులు పూర్తి కానుంది. కొద్ది రోజుల విరామం తర్వాత మళ్లీ జనవరి 3న ఢిల్లీ నుండి ప్రారంభం కానుంది.

# శంషాబాద్ విమానాశ్రయంలో కోవిడ్ నిబంధనలు

హైదరాబాద్,డిసెంబర్24(సమసమాజం): అంతర్జాతీయ ప్రయాణికుల కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇవి శనివారం నుంచి అమల్లోకి వచ్చాయి. పూర్తి టీకా, ఆర్టీపీసీఆర్ పరీక్షలకు సంబంధించిన రుజువులను చూపించడం తప్పనిసరి చేసింది. ప్రయాణానికి 72 గంటల ముందు చేయించుకున్న ఆర్టీపీసీఆర్ వివరాలు, టీకాకు సంబంధించిన పూర్తి వివరాలతో 'ఎయిర్ సువిధ' ఫామ్‌ను నింపాలని విమానాశ్రయ అధికారులు స్పష్టం చేసారు. ఈ కొత్త మార్గదర్శకాలు శనివారం నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపారు.

# త్వరలోనే డబుల్ డెక్కర్ బస్సులు

### కొత్త లగ్జరీ బస్సులు ప్రారంభించిన బాజిరెడ్డి



హైదరాబాద్,డిసెంబర్24(సమసమాజం): త్వరలోనే హైదరాబాద్ నగరానికి డబుల్ డెక్కర్ బస్సులు రానున్నాయని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై శనివారం ఆర్టీసీకి చెందిన 50 కొత్త సూపర్ లగ్జరీ బస్సులను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌తో కలిసి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ ఆర్టీసీ చరిత్రలో పెద్ద ఎత్తున బస్సులు కొనుగోలు చేశామన్నారు. ÷-వరలోనే ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. సమిష్టి కృషితో ఆర్టీసీ అద్భుతంగా ముందుకెళ్తోందన్నారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాఉడూత సీఎం సహకారంతో రాష్ట్రంలో భారీగా బస్సులను కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఏటా బ్జడెట్‌లో రూ.500కోట్లు సీఎం కేసీఆర్ కేటాయిస్తున్నారని, ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు. సిబ్బంది కృషి వల్లే ప్రతి నెలా నష్టాలు తగ్గుతున్నాయన్నారు. డీజిల్ ధరలు పెరిగిన ఆర్టీసీ చార్జీలు పెంచలేదని, సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు ఇచ్చినట్లు వివరించారు.

# ఏటా బూస్టర్ డోస్ తీసుకోవాల్సిందే




హైదరాబాద్,డిసెంబర్24(సమసమాజం): ప్రపంచ దేశాలపై కరోనా విజృంభిస్తోన్న వేళ ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి వ్యాక్సిన్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. బూస్టర్ డోస్‌గా కార్బోవ్యాక్స్ టీకాను తీసుకోవడం ఉత్తమమని, దీని వల్ల ఐజీజీ యాంటిబాడీస్ స్థాయిలు అత్యధికంగా పెరగడమే కాకుండా మెమరీ సెల్స్ సైతం ఎక్కువ కాలం పాటు ఉంటున్నాయని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. కరోనా విషయంలో ప్రజలు భయాందోళనకు గురికావల్సిన పనిలేదని, బీఎఫ్-7 సబ్‌వేరియంట్ డెల్టా వేరియంట్ అంత ప్రమాదకారి కాదని స్పష్టం చేశారు. అయితే, కరోనా పూర్తిగా తగ్గనందున ఏటా ఒకసారి బూస్టర్ డోస్ తీసుకోవటం మంచిదని ఆయన తెలిపారు. ప్రజలు కరోనా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆప్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఎమ్మెల్యే సౌరబ్ భరద్వాజ్, ప్రముఖులు

### సౌరబ్ భరద్వాజ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించిన ఇందిరా శోభన్



హైదరాబాద్,డిసెంబర్24(సమసమాజం): ఢిల్లీ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం జిహెచ్ఎంసి పరిపాలన సంబంధించి స్టడీ టూర్ లో భాగముగా హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే సౌరబ్ భరద్వాజ్, ఎమ్మెల్యే ఆతిషి, ఎమ్మెల్యే సంజీవ్ ఝా, ఎమ్మెల్యే సొమ్ దత్, ఎమ్మెల్యే అఖిలేష్ త్రిపాఠి, ఎమ్మెల్యే అజేశ్ యాదవ్, తదితరులు బృందంలో ఉన్నారు, ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ఇందిరా శోభన్, బుర్ర రాము గౌడ్, శోభన్ బాబు భూక్య తాజ్ కృష్ణ హొటల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు ఇచ్చి, శాలువాలు కప్పి సత్కరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆమ్ ఆద్మీ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు సూచించారు మరియు పార్లమెంటరీ కన్వీనర్లు, రాష్ట్ర నాయకులు, జిహెచ్ఎంసి నాయకులు,, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు,పార్టీ వాలంటీర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి వారిని సత్కరించారు.

# అశ్రునయనాల మధ్య కైకాల అంత్యక్రియలు

### అధికారిక లంఛానాలతో మహాప్రస్థానం ముగింపు


### ఫిలం నగర్ నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర





హైదరాబాద్,డిసెంబర్24(సమసమాజం): సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణ అంత్యక్రియలు ముగిసాయి. ఫిలింనగర్‌లోని కైకాల నివాసం నుండి మహాప్రస్థానం వరకు ఆయన పార్థీవ దేహానికి అంతిమయాత్ర నిర్వహించి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. ప్రముఖుల నివాళులు, అభిమానుల అశ్రు నయనాల నడుమ కైకాల సత్యనారాయణ అంత్యక్రియలు ముగిశాయి. జూబ్లీహిల్స్‌లోని మహా ప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో తుది వీడ్కోలు పలికారు. కైకాల పార్థివదేహాన్ని ఫిలింనగర్‌లోని ఇంటి నుంచి మహాప్రస్థానంకు అంతిమయాత్రగా తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు, కొంత మంది ప్రముఖులను మాత్రమే లోపలికి అనుమతించి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు గౌరవ వందనం తర్వాత గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి నివాళులర్పించారు. కైకాల పెద్ద కుమారుడు లక్ష్మినారాయణ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తర్వాత మిగిలిన కార్యక్రమాలు నిర్వహించి కైకాలకు తుది వీడ్కోలు పలికారు. పలువురు నటులు, రాజకీయ నాయకులతో పాటు అభిమానులు సందర్శించి నివాళులు అర్పించారు. కైకాల చివరి చూపు కోసం వేలాది మంది అభిమానులు అంతిమ యాత్రకు తరలివచ్చారు. అభిమాన నటుడిని కడసారి చూసేందుకు సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కైకాల కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గతకొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కైకాల.. శుక్రవారం తెల్లవారు జామున ఫిలిం నగర్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయనకు సినీ, రాజకీయ ప్రముఖులు నివాళి అర్పించారు. నటులు పవన్ కళ్యాణ్, చిరంజీవి, వెంకటేష్, నాగబాబు, రాజేంద్ర ప్రసాద్, రాధ వంటి పలువురు సినీ ప్రముఖులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. టాలీవుడ్ దిగ్గజ నటుడు కైకాల సత్యనారాయణ అంత్యక్రియలు ముగియడంతో తెలుగు సినీ చరిత్రలో కైకాల శకం ముగిసింది. నవరస నటనా సార్వభౌముడు కైకాల మరణం సినీలోకానికి తీరని విషాదం నింపింది. తెలుగు కళామ్మ తల్లి ముద్దుబిడ్డగా.. అజాత శత్రువుగా తనకంటూ ప్రత్యేకంగా స్థానాన్ని సంపాదించుకున్నారు కైకాల సత్యనారాయణ. దిగ్గజ నటుడ్ని కడసారి చూసేందుకు సినీ, రాజకీయ లోకం తరలివచ్చింది. నవరస నటనా సార్వభౌముడు కైకాల సత్యనారాయణ పార్థివ దేహానికి తెలంగాణ సీఎం కేసీఆర్ సహా ప్రముఖులందరూ నివాళులు అర్పించారు. తెలుగు నటశిఖరం కైకాల సత్యనారాయణ చివరిచూపు కోసం సినీ, రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. ఆయన భౌతికకాయానికి చిరంజీవి, పవన్‌కల్యాణ్ నివాళి అర్పించారు. మహా నటుడి భౌతిక కాయానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు. నవరసాలను పండించగల నవరస నటనా సార్వభౌమ కైకాల సత్యనారాయణ గారు ఇప్పుడు మనమధ్య లేరంటే బాధగా ఉందని ప్రతి ఒక్కరూ చర్చించుకోవడం కంటతడి పెట్టించింది.

# క్రిస్మస్‌కు ముస్తాబైన మెదక్ చర్చి విద్యుద్దీపాలతో ధగధగలు



(మొదటి పేజీ తరువాయి)జరిగే క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. క్రిస్మస్ వేడుకలకు మెదక్ నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు, పర్యాటకులు తరలివస్తుంటారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు చర్చి కమిటీ సభ్యులు తెలిపారు. ఇక చర్చి ప్రాంగణంలో వివిధ రకాల గృహ అలంకరణ, ఆటబొమ్మల దుకాణాలు వెలిశాయి. రంగుల రాట్నం, మినీ ఈత కొలనులు, జంపింగ్ గేమ్స్, మినీసర్కస్, మినీరైల్, పిల్లలు ఆడుకునే ఆట బొమ్మలను ఏర్పాటు చేశారు. శనివారం నుంచే ప్రార్థనలు మొదలయ్యాయి. వేలాదిగా క్రిష్టియన్లు తరలి వస్తున్నారు. క్రిస్మస్ సందర్భంగా క్రిష్టియన్లకు స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రపతి ముర్ముకు స్వాగత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)పది మందితో కూడిన బృందాన్ని గిరిజన సంక్షేమ శాఖ సిద్ధం చేసింది. అనంతరం కొంత మంది గిరిజనులతో రాష్ట్రపతి ముఖాముఖి భేటీ కానున్నారు. 28న రామప్ప, భద్రాచలం ప్రాంతాల పర్యటనల సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని గిరిజనులతోనూ రాష్ట్రపతి ముచ్చటించనున్నారు. రాష్ట్రానికి వస్తున్న రాష్ట్రపతికి స్వాగతం పలుకుతూ గిరిజన తెగల నృత్యాన్ని ప్రదర్శించడం ఇదే మొదటిసారి. గిరిజనులతోనూ రాష్ట్రపతి భేటీ కావడం ఇదే మొదటిసారి. అయితే గిరిజనులతో భేటీ సమాచారం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

## మేడ్చల్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)ముగ్గురు నేతలు ఇష్టమొచ్చినట్టు దుర్భాష లాడారు. అర్ధరాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి వాహనం యూటర్న్ తీసుకునే ప్రయత్నం చేడయంతో అనుమానం వచ్చి కారును ఆపేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడానికి ప్రయత్నిస్తే పోలీసులపైనే దురుసుగా ప్రవర్తించారు. పోలీసులు అయితే ఏం చేస్తారంటూ చాలా ర్యాష్ గా మాట్లాడారు. మద్యం సేవించనప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌కు ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. పూటుగా మద్యం సేవించి ఎక్కడ దొరికిపోతావేమో అనే భయంతో తమకు సహకరించడం లేదని పోలీసులు చెబుతున్నారు.

## అజాత శత్రువు..నిస్వార్థరాజకీయ నేత

(మొదటి పేజీ తరువాయి)దేశహితమే వాజ్‌పేయ్ అభిమతమన్నట్లుగా ఆయన జీవితాంతం పనిచేశారు ఆయన దేశానికి చేసిన విశేష సేవలకు గాను భారత ప్రభుత్వం మార్చి 12, 2015లో భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. ఆయన పుట్టినరోజు అయిన డిసెంబర్ 25ను సుపరి పాలనా దినంగా భారత ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఏటా ఇప్పుడు డిసెంబర్ 25ను సుపరిపాలనా దినంగా పాటిస్తున్నారు. 2015 మార్చి 27న ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, వాజపేయికి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రదానం చేసారు. అనారోగ్యంతో పూర్తిగా మంచంపై ఉన్న వాజపేయికి భారతరత్న ప్రదానం చేయడానికి స్వయంగా ఆనాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వాజపేయి నివాసానికి తరలి వెళ్ళారు. హిందీ, ఆంగ్లము, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్టభద్రుడైన వాజ్‌పేయ్ అనర్గళ ఉపన్యాసకుడు. చతురోక్తులతో సమ్మోహితులను చేసే రాజకీయ స్రష్ట. 14వ లోక్ సభ ముగిసేవరకు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. ఆయన రెండుసార్లు రాజ్యసభకు కూడా ఎన్నికయ్యారు. 1968 నుండి 1973 వరకు జనసంఘ్ పార్టీకి అధ్యక్షుడిగా పనిచేసి, 1980 నుండి 1986 వరకు భారతీయ జనతా పార్టీకి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. 1996లో తొలిసారిగా ప్రధానమంత్రి పదవి యోగం లభించినా అది 13 రోజులకే పరిమితమైంది. 1998లో రెండో పర్యాయం ప్రధానమంత్రి పదవి పొంది 13 మాసాలు పాలించారు. 1999లో 13వ లోక్‌సభ ఎన్నికల అనంతరం మరోసారి ప్రధానమంత్రి పదవి చేపట్టి 2004 వరకు పదవిలో ఉన్నారు. అలుపెరుగని ఈ రాజకీయ నాయకుడికి 1994లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది. మొదటి కాంగ్రేసేతర ప్రభుత్వమైన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖను నిర్వహించి ప్రపంచనేతల ప్రశంసలు పొందారు. వాజపేయి గ్వాలియర్‌లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన 1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లో కూడా చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 1940-44 లలో అధికార్ల శిక్షణా కేంద్రానికి హాజరైనాడు. ఆయన 1947 లో 'పూర్తి స్థాయి సేవకుడు' అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయశాస్త్ర విద్యా భ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజపేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయమేర్పడింది. 1954లో కాశ్మీరులో కాశ్మీరేతర భారతీయ సందర్శకులను చిన్నచూపు చూస్తున్నారన్న విషయమై నిరసన ప్రకటిస్తూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించి నప్పుడు, వాజపేయి ఆయన వెంటే ఉన్నాడు. ముఖర్జీ ఈ నిరాహారదీక్షా సమయంలోనే కాశ్మీరు జైలులో మరణించాడు. 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్దాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించాడు. ఆయనకు గల వాగ్దాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీలతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. ఎన్‌డిఏ పార్టీల కూటమితో 1998 లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బిజెపి అన్ని పార్టీల కంటే అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. ఈ కాలంలో భావసారూప్యత కలిగిన పార్టీలన్ని కలిసి నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్‌గా యేర్పడ్డాయి. వాజపేయి రెండవసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు. అయితే ఆనాడే వాజ్‌పేయ్ చేసిన ప్రకటన ఇప్పుడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎప్పటికైనా బిజెపి సంపూర్ణ మెజార్టీ సాధించి అధికారంలోకి వస్తుందని ప్రకటించాడు. ఇప్పుడు మోదీ నాయకత్వంలో ఆయన కల నెరవేరింది.

# ఆదానీ,అంబానీల జేబు సర్కార్



(మొదటి పేజీ తరువాయి)ప్రభుత్వం చేస్తోందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ విధానాల వల్ల దేశంలో భయాందోళనలు ఆవరించాయని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్రలో పాల్గొనద్దని కొంతమంది చెప్పారని కమల్ హాసన్ తెలిపారు. యాత్రలో పాల్గొంటే రాజకీయ భవిష్యత్ దెబ్బతింటుందని అన్నారన్నారు. అయితే యాత్రలో పాల్గొనడం సంతోషంగా ఉందని కమల్ తెలిపారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఢిల్లీలో రాహుల్ వెంట ఆయన నడిచారు. నేను భారతీయుడిని ఎక్కడికైనా వెళ్తా. నాకు దేశమే ఫస్ట్..అన్ని పార్టీలు నావే. మా నాన్న కాంగ్రెస్ వాది అని కమల్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' శనివారం ఢిల్లీలోకి ప్రవేశించింది. ఢిల్లీ వీధుల్లో కిక్కిరిసిపోయే జన సందోహం మధ్య ఆయన యాత్ర కొనసాగుతోంది. సోనియా, ప్రియాంక గాంధీ, రాబర్ట్ వాద్రా జోడోయాత్రలో పాల్గొన్నారు. ఇక డిసెంబర్ 16 నాటికి రాహుల్ జోడో యాత్ర 100 రోజులు పూర్తి చేసుకుంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రలో తాను ఓ భారతీయుడిగా పాల్గొన్నానని ప్రముఖ నటుడు కమల్ హాసన్ చెప్పారు. ఈ యాత్రలో ఎందుకు పాల్గొన్నారని తనను చాలా మంది అడుగుతున్నారన్నారు. తన తండ్రి కాంగ్రెస్‌వాది అని, తనకు రకరకాల భావజాలాలు ఉన్నాయని చెప్పారు. తాను సొంతంగా ఓ రాజకీయ పార్టీని ఏర్పాటు చేశానని, అయితే దేశం విషయానికి వచ్చేసరికి అన్ని రాజకీయ పార్టీల రేఖలు మసకబారిపోవాలన్నారు. ఆ రేఖను తాను మసకబార్చి, ఇక్కడికి వచ్చానని చెప్పారు. ఈ యాత్ర ఢిల్లీలోని ఎర్ర కోట వద్దకు చేరుకున్న తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో యాత్ర తమిళనాడులోని కన్యాకుమారి నుంచి సెప్టెంబరులో ప్రారంభమైంది. హర్యానాలోని ఫరీదాబాద్ నుంచి శనివారం ఉదయం ఢిల్లీలో ప్రవేశించిన సందర్భంగా ఈ యాత్రలో పాల్గొన్నవారిలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా , జైరామ్ రమేశ్, పవన్ ఖేరా, భూపిందర్ సింగ్ హుడా, కుమారి సెల్జా, రణదీప్ సుర్జేవాలా, రాబర్ట్ వాద్రా, వాద్రా దంపతుల పిల్లలు ఉన్నారు. ్రాహుల్ గాంధీ కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఆశ్రమ్ చౌక్ వరకు ఆయనతో కలిసి నడిచారు. కర్ణాటకలోని మాండ్యలో కూడా సోనియా గాంధీ ఈ యాత్రలో పాల్గొన్నారు. రాహుల్ ఇచ్చిన ట్వీట్‌లో, తాను తన తల్లి నుంచి పొందిన ప్రేమను దేశానికి పంచుతున్నానని తెలిపారు. తన తల్లితో కలిసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. ఇప్పటి వరకు సుమారు 3,000 కిలోమీటర్ల మేరకు ఈ యాత్ర సాగింది. దాదాపు మరో 570 కిలోమీటర్లు పాదయాత్ర చేసి, జమ్మూ-కశ్మీరులో ముగిస్తారు.

# కేంద్రం విధానాల వల్లనే జీతాలు ఆలస్యం




(మొదటి పేజీ తరువాయి)కోట్లకు కోత పెట్టిందని మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఉపాధ్యాయుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామని మంత్రి వెల్లడించారు. కేంద్రం నిధులు ఆపడం వల్లే టీచర్ల జీతాల చెల్లింపులో ఆలస్యం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రమోషన్లు, బదిలీల విషయంలో కేసీఆర్ పాజిటివ్‌గా ఉన్నారు. ఆ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. విద్యాశాఖలోని ఖాళీలన్నింటిని త్వరలోనే భర్తీ చేస్తాం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో మొట్టమొదటి ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ. ఉపాధ్యాయుల హక్కుల కోసమే కాకుండా సమాజం కోసం, విద్యార్థుల కోసం పోరాటం చేసిన సంస్థ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం. ఈ సంఘం ఇంకా అద్భుతంగా ముందుకు వెళ్లాలి. ఉన్నత విద్యాబోధన కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. ఒకటో తేదీన జీతాలు వస్తుండే.. ఇప్పుడేమో పదో తారీఖుకు జీతాలు వస్తున్నాయని మీరు అనుకుంటున్నారని ఉపాధ్యాయులను ఉద్దేశించి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. జీతాల గురించి మీకు కూడా ఆందోళన ఉంది. డబ్బులు ఉండి మీకు ఇవ్వకుండ ఉంటామా? కావాలని ఆపుతామా? మొదటి ఆరేడు ఏండ్లు ఎప్పుడు కూడా జీతాలు ఆగలేదు. ఏడాది కాలం నుంచి ఈ సమస్య వస్తుంది. ఇది మీకు కూడా తెలిసి ఉంటే మంచిది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడుతుంది. ఆర్థికంగా ఇబ్బంది పెడుతున్నారు. అసెంబ్లీలో రెండున్నర లక్షల కోట్లకు బడ్జెట్ పాస్ అయింది. బడ్జెట్ పాసైన తర్వాత ఏకపక్షంగా కేంద్ర ప్రభుత్వం రూ. 15 వేల కోట్లు ఎఫ్ఆర్బీఎం నిధులలో కోత పెట్టేసింది. బోరు బావుల వద్ద మీటర్లు పెట్టడం లేదని రూ. 12 వేల కోట్ల నిధులు రాష్ట్రానికి రాకుండా నిలిపివేశారు. 15వ ఆర్థిక సంఘం చెప్పిన రూ. 5 వేల కోట్లు కూడా ఇవ్వలేదు. మన రాష్ట్రానికి హక్కుగా, వాటాగా రావాల్సిన రూ. 40 వేల కోట్లను కేంద్రం నిలిపివేసింది. దీంతో కొంత ఇబ్బంది జరుగుతున్న మాట వాస్తవం. దేశంలో అతి ఎక్కువ వేతనాలు పొందుతున్న ఉద్యోగులు ఎవరంటే అది తెలంగాణ ఉపాధ్యాయులే. వీలైనంత త్వరగా జీతాల సమస్యను పరిష్కరిస్తాం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. గురువు లేనిదే విద్య లేదు. విద్య లేనిదే జ్ఞానం లేదు. జ్ఞానం లేకపోతే ఈ లోకంలో మనుగడ ఉండనే ఉండదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ దృష్టి సారించారు. ప్రతి మనిషి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురుకు క్రియాశీలక పాత్ర పోషిస్తారు. మార్కులు, ర్యాంకులే కాకుండా.. ఉన్నత విలువలు నేర్పించేలా విద్యా బోధన కొసాగాల్సిన అవసరం ఉంది. మంచి విద్యతో పాటు విలువలు, బాధ్యత కలిగిన విద్యార్థులను సమాజానికి అందించాలి. మార్కులు, ర్యాంకులు కూడా ముఖ్యమే. అయినప్పటికీ విలువలతో కూడిన భావి భారత పౌరులను సమాజానికి అందించడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. దీని కోసం మనందరం కృషి చేయాల్సిన అవసరం ఉంది అని మంత్రి పేర్కొన్నారు. కేంద్రం మోడల్ స్కూల్స్‌ను రద్దు చేసింది. అయినా మనం కొనసాగించాం అని హరీశ్‌రావు తెలిపారు. అంగన్‌వాడీల బడ్జెట్‌ను తగ్గించింది. కానీ మనం అంగన్‌వాడీల ప్రమాణాలను పెంచి బలోపేతం చేసుకుంటున్నాం. గురుకుల పాఠశాలలను 1201కి పెంచుకున్నాం. గురుకులాల బడ్జెట్ రూ. 3250 కోట్లు కేటాయించాం. విద్యాశాఖకు రూ. 25 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాం. ప్రతి జిల్లాకు ఒక మెడికల్, నర్సింగ్, పారామెడికల్ కాలేజీలను అందుబాటులోకి తీసుకొచ్చాం. అటవీ శాఖలో కూడా యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ఇది దేశంలోనే తొలి యూనివర్సిటీ. అక్కడ చదువుకున్న విద్యార్థులు జాతీయ స్థాయి ఉద్యోగాలను సంపాదిస్తున్నారు. గురుకులాల్లో పీజీ, లా, డిగ్రీ కాలేజీలను ప్రారంభించుకున్నాం. వ్యవసాయ, వెటర్నరీ శాఖల్లో కూడా కాలేజీల స్థాపన జరుగుతుంది. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నేతలు కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## సిరిసిల్లలో అధికార పార్టీ బిఆర్ఎస్‌కు షాక్

(మొదటి పేజీ తరువాయి)పనిచేస్తున్నానని.. ఉద్యమ సమయంలో తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పటికీ జేఏసీలో చేరి పోరాటం కొనసాగించానని చెప్పారు. కేటీఆర్ పిలుపు మేరకు పార్టీలో చేరిన తాను పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశానని గుర్తు చేశారు. పార్టీ కోసం ఎంతో కష్టపడిన తనకు పార్టీ నుంచి సరైన ఆదరణ లభించలేదని వాపోయారు. కేటీఆర్ ను కలిసే అవకాశమేఇవ్వలేదు.. మా అమ్మ చనిపోయినా పరామర్శించడానికి కేటీఆర్ రాకుండా చేశారు.. అలాగే నా అన్న చనిపోయిన తర్వాత కూడా అదే పరిస్థితి.. చివరకు మా అత్త చనిపోయినా.. నా వద్దకు కేటీఆర్ రాకుండా అడ్డుకున్నారు.. అంతేకాదు నాకు క్యాన్సర్ సోకి రెండేళ్లు ఆస్పత్రి చుట్టూ చికిత్స చేసుకుంటున్నప్పుడు కూడా కేటీఆర్ నా వద్దకు వచ్చి పరామర్శించకుండా అడ్డుపడ్డారు. అయితే కేటీఆర్ సహకరించడంతో చికిత్స చేయించుకున్నానని.. అదే కృతజ్ఞతతో పార్టీ కోసం అందరికంటే ఎక్కువ కష్టపడ్డా.. అవన్నీ కేటీఆర్ దృష్టికి వెళ్లాయో లేదో తెలియదని అన్నారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో నా తమ్ముడు పోటీకి దిగితే మానుకోమని మా సోదరుడికి చెప్పి.. పార్టీ అభ్యర్థి అయిన లక్ష్మినారాయణ గెలుపు కోసం పనిచేశానని చెప్పారు. పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్న తాను ప్రతిసారి పార్టీ కోసం సరే అని సర్దుకున్న కొద్దీ అవమానాలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. నా కుటుంబ సభ్యులు చని పోయినా కూడా మంత్రి కేటీఆర్ పరామర్శిండానికి రాకుండా అడ్డుపడడమే కాదు.. తాను ఎన్నో సార్లు కేటీఆర్ కలవాలి అని ప్రయత్నించినా పార్టీ నాయకులు ఏనాడూ తనకు అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ వాళ్లే నన్ను అనుమానిస్తుం దడమే కాదు ఎన్నికల్లో ఎవరికి సపోర్ట్ చేస్తున్నానో అని నిఘా పెట్టి వేధించారని.. పార్టీ కోసం ఎంతో కష్టపడినప్పటికీ..కొందరి తీరుతో పార్టీకి రాజీనామా చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తూ.. కౌన్సిలర్ పత్తిపాక పద్మ వీడియో సందేశం విడుదల చేశారు.

## శ్రీకృష్ణ జన్మస్థానంపై పటిషన్

(మొదటి పేజీ తరువాయి)చేయాలంటూ స్థానిక కోర్టు ఆదేశాలిచ్చింది. జనవరి 2 తర్వాత సర్వేను చేపట్టి.. జనవరి 20లోగా నివేదికను సమర్పించాలని నిర్దేశించింది. హిందూ సేన అనే సంస్థకు చెందిన విష్ణు గుప్తా వేసిన న్యాయ వ్యాజ్యాన్ని విచారించిన కోర్టు ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. యూపీలోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపి మసీదు సర్వేను నిర్వహించిన తరహాలోనే.. షాహీ ఈద్గా మసీదు సర్వేను కూడా చేయాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను జనవరి 20న నిర్వహిస్తామని తెలిపింది. మధురలో కత్రా కేశవ్ దేవ్ ఆలయం పక్కనే ఉన్న షాహీ ఈద్గా మసీదుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతంలో ఎన్నో హిందూ సంస్థలు కోర్టులో కేసులు వేశాయి. హిందూ సేన సంస్థ జాతీయ అధ్యక్షుడు విష్ణు గుప్తా వేసిన పిటిషన్ కూడా ఆ కోవలోకే వస్తుంది. శ్రీ కృష్ణ పరమాత్ముడు జన్మించిన ప్రదేశంలో షాహీ ఈద్గా మసీదును నిర్మించారని పిటిషనర్ విష్ణు గుప్తా ఆరోపించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబ్ ఆదేశాల మేరకు 1669 1670 సంవత్సరాల మధ్యకాలంలో కత్రా కేశవ్ దేవ్ ఆలయ పరిసరాల్లోని 13.37 ఎకరాల స్థలంలో షాహీ ఈద్గా మసీదును కట్టారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈమేరకు అభియోగాలతో పిటిషనర్ విష్ణు గుప్తా తరపు న్యాయవాది శైలేశ్ దూబే ఈ ఏడాది డిసెంబరు 8న కోర్టులో వాదనలు వినిపించారు. శ్రీ కృష్ణ జన్మస్థాన్ సేవా సంఘ్, షాహీ ఈద్గా మసీదు కమిటీ మధ్య 1968 సంవత్సరంలో కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ అగ్రిమెంట్ అన్యాయమైందని పిటిషనర్ అభిప్రాయపడ్డారు. ఈ వాదనల నేపథ్యంలోనే మధురలోని ఓ కోర్టు తాజా ఆదేశాలను జారీ చేసింది.

# కొత్త వేరియంట్ బీఎఫ్-7 దడ



(మొదటి పేజీ తరువాయి)వారం రోజుల ముందే కొత్త వేరియంట్ బీఎఫ్-7 సబ్‌వేరియంట్ సందడి మొదటు పెట్టింది. ఈసారి మరోమారు వైరస్ దడ పుట్టిస్తోంది. ఈసారి కేసులు బాగా తగ్గిపోయి అన్నీ సద్దుమణిగి పోతున్నాయనుకునే లోపు మళ్లీ ఇప్పుడు వణుకుతో వేడుకల ఆశలపై నీళ్లు చల్లాయి. కరోనాకు ముందు నగరాలతోపాటు, పట్టణాల్లోను స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, ఈవెంట్ సంస్థలు విందులు, వినోదాలు భారీగా ఏర్పాటు చేస్తున్నాయి. కానీ ఇప్పుడు కొత్తగా బీఎఫ్-7 సబ్‌వేరియంట్ వేరియంట్ వణికిస్తుండంతో కొత్త సంవత్సర వేడుకల కళ పూర్తిగా తప్పనుందన్న భావన ఏర్పడింది. ఇప్పటికే స్టార్ హోటళ్ల దగ్గర నుంచి ఓ మోస్తరు రెస్టారెంట్ల వరకు రకరకాల విందులు, వినోదాలు ఏర్పాటు చేసాయి. డీజే బృందాలతోపాటు సినీ నటులను తీసుకువచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధం అవుతున్నారు. తాజా ఆదేశాలతో ఆంక్షలు విధించే అవకాశాలు ఉన్నాయి. కొత్త సంవత్సరానికి మరో వారం రోజులే ఉన్నా తాజా హెచ్చరికలతో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది చూడాలి. ఇప్పుడిప్పుడే అన్ని రంగాలు కోలుకుంటున్నాయి. దీంతో ఈసారి భారీగా న్యూఇయర్ వేడుకలకు అన్ని హోటళ్లు భారీగా ప్రణాళికలు సిద్ధం చేశాయి. కానీ కొత్త ముప్పు అనూహ్యంగా దూసుకుని వచ్చింది. చాపకిందనీరులా వ్యాపిస్తోంది. దీనిపట్ల అప్రమత్తంగా ఉండాల్సిందేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెచ్చరికలు జారీచేసింది. చైనా,బ్రిటన్, అమెరికా వంటి దేశాల్లో లక్షల్లో కేసులు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో కోట్లరూపాయాలను వెచ్చించి ఈవెంట్లు నిర్వహిస్తే కేసుల ముప్పు, జనం రాకపోతే నష్టపోతామ నే ఆందోళనతో ఈవెంట్లు రద్దుచేసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారులు మరోమారు పెద్దగా నష్టపోనున్నారు. ఇలాంటి వారికి మళ్లీ ప్రభుత్వాలు అండగా నిలవాల్సి ఉంది.

# శబరిమల యాత్రలో విషాదం



**తిరువనంతపురం,డిసెంబర్24(సమసమాజం):** శబరిమల యాత్రలో విషాదం చోటు చేసుకుంది. అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి లోయలో పడడంతో 8 మంది అక్కడికక్కడే కన్నుమూశారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. తమిళనాడు నుంచి యాత్రికులు ప్రయాణిస్తున్న టెంపో కేరళలోని ఇడుక్కి జిల్లా కుమిలి-కంబం రహదారిపై వెళ్తుండగా వాగులోకి బోల్తా పడింది. స్థానికులు ఆ ప్రమాదాన్ని గుర్తించి పోలీసులకు సమచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాగా టెంపోలో ఓ చిన్నారితో సహా తొమ్మిది మంది ప్రయాణిస్తున్నారు. క్షతగాత్రులను కుమిలిలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈఘటన గురించి ఇడుక్కి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందడంతో.. అర్ధరాత్రే అక్కడకు చేరుకున్నారు. రెస్క్యూ ఆపరేషన్ సహాయంతో క్షతగాత్రులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రమాదం శుక్రవారం అర్ధరాత్రి సమయంలో జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా.. ఒకరు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. మృతులు తమిళనాడు థేనీ జిల్లాలోని అండిపెట్టి ప్రాంతానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# విజయం ముంగిట రెండో టెస్ట్

**మరో వంద పరుగుల చేస్తే గెలిచినట్లే**

**45 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన భారత్**

**231 పరుగుల వద్ద ముగిసిన బంగ్లా రెండో ఇన్నింగ్స్**



ఢాకా,డిసెంబర్24(సమసమాజం): భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ ముగిసింది. 231 పరుగులకు ఆలౌటై పర్యాటక జట్టుకు 145 పరుగుల లక్ష్యాన్నినిర్దేశించింది. భారత బౌలర్లు పోటీలు పడి వికెట్లు తీయడంతో క్రీజులోకి వచ్చినట్టే వచ్చి బంగ్లాదేశ్ బ్యాటర్లు వెనుదిరిగారు. దీంతో బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. జకీర్ హసన్ (51), లిటన్ దాస్ (73) అర్ధ సెంచరీలతో ఆదుకునే ప్రయత్నం చేసినా బౌలర్లు వారి ఆటలు సాగనివ్వలేదు. చివర్లో నూరుల్ హసన్ (31), తస్కిన్ అహ్మద్ (31) కాసేపు పోరాడి స్కోరు పెంచే ప్రయత్నం చేశారు. బంగ్లా బ్యాటర్లలో ఆరుగురు ఆటగాళ్లు సింగిల్ డిజిట్ దాటలేకపోయారు. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ మూడు వికెట్లు తీసుకోగా, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ సిరాజ్ చెరో రెండు వికెట్లు, ఉమేశ్ యాదవ్, ఉనద్కత్ చెరో వికెట్ పడగొట్టారు. అంతకుముందు బంగ్లాదేశ్ తన తొలి ఇన్నింగ్స్‌లో 227 పరుగులు చేయగా, భారత్ 314 పరుగులు చేసింది. ఈ క్రమంలో రెండో టెస్టులో భారత్ విజయం ముంగిట నిలిచింది. మూడో రోజు ఆట ముగిసే సరికి ఇండియా 4 వికెట్లు కోల్పోయి 45 రన్స్ చేసింది. మరో 100 రన్స్ చేస్తే ఇండియా టెస్ట్ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేస్తుంది. నైట్‌వాచ్‌మెచ్ అక్షర్ పటేల్ 26, జయదేవ్ ఉనాద్కత్ 3 పరుగులతో క్రీజులో ఉన్నారు. 145 టార్గెట్ చిన్నదే అయినప్పటికీ బంగ్లా బౌలర్లు పోరాడడంతో భారత్ రెండో ఓవర్‌లోనే రాహుల్ వికెట్ కోల్పోయింది. మెహిదీ హసన్ మిరాజ్ కీలకమైన పూజారా, గిల్, విరాట్ కోహ్లీ వికెట్లు పడగొట్టాడు. కేఎల్ రాహుల్ రెండో ఓవర్‌లో 2 పరుగులకే వెనుదిరిగి నిరాశ పరిచాడు. అడ్డుగా నిలుస్తాడనుకున్న పుజారా (6) రెండో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. తొలి టెస్టులో విఫలమైన కోహ్లీ ఈసారి కూడా బ్యాట్ ఝులిపించలేక పోయాడు. తైజుల్ ఇస్లాం బౌలింగ్‌లో రివ్యూతో బతికిపోయిన కోహ్లీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. 22 బంతుల్లో ఒక్క పరుగు మాత్రమే చేశాడు. అక్షర్ పటేల్, ఉనాద్కత్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 7/0 తో ఉన్న బంగ్లాదేశ్‌ను అక్షర్ పటేల్ మూడు వికెట్లు తీసి దెబ్బతీశాడు. సిరాజ్, అశ్విన్ కూడా విజృంభించడంతో రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 231 రన్స్‌కే పరిమితమైంది. టెయిలెండర్లు నురుల్ హసన్ (31) , తస్కిన్ అహ్మద్ (31)తో కలిసి లిట్టన్ దాస్‌లు (73) బంగ్లా స్కోర్‌ను రెండొందలు దాటించాడు. రవిచంద్రన్ అశ్విన్, సిరాజ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఉనాద్కత్, ఉమేశ్ యాదవ్‌కు చెరో వికెట్ దక్కింది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్‌కు 87 పరుగుల ఆధిక్యం లభించింది.

# హాకీ కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ సింగ్



న్యూఢిల్లీ,డిసెంబర్24(సమసమాజం): సొంతగడ్డపై జరిగే మెన్స్ హాకీ వరల్డ్‌కప్‌లో పోటీ పడే ఇండియాకు డిఫెండర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జనవరి 13 నుంచి ఒడిశాలో జరిగే ఈ టోర్నీ కోసం హాకీ ఇండియా 18 మందితో కూడిన టీమ్‌ను శుక్రవారం ప్రకటించింది. అమిత్ రోహిదాస్? వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. టీమ్: క్రిషన్ బహదూర్, శ్రీజేష్ (గోల్ కీపర్లు), జర్మన్‌ప్రీత్ , సురేందర్ హర్మన్‌ప్రీత్ సింగ్, వరుణ్ కుమార్, అమిత్ రోహిదాస్, నీలం సంజీప్ (డిఫెండర్లు), మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, నీలకంఠ శర్మ, షంషేర్ సింగ్, వివేక్ సాగర్ , ఆకాశ్‌దీప్ ( మిడ్‌ఫీల్డర్లు), మన్‌దీప్, లలిత్ ఉపాధ్యాయ్, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్

# మెస్సీ ధరించిన కోటు ధర పదిలక్షల డాలర్లు



న్యూఢిల్లీ,డిసెంబర్24(సమసమాజం): ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో విజయం తర్వాత అర్జెంటీనా కెప్టెన్ లియోనల్ మెస్సీ ఉద్వేగానికి గురయ్యాడు. సహచరులతో కలిసి డాన్స్ చేస్తూ సంబురాలు చేసుకున్నాడు. అయితే.. ట్రోఫీ అందుకునే ముందు ఖతర్ రాజు షేక్ తమిమ్ బిన్ హమద్ అల్ థానీ మెస్సీకి నల్లని కోటు తొడిగారు. ఆ కోటు ధర ఎంతంటే.. 10 లక్షల డాలర్లు. అంత విలువైన కోటును మెస్సీకి ఎవరు బహూకరించారో తెలుసా.. ఒమన్‌కు చెందిన అహ్మద్ అల్ బర్వానీ అనే పార్లమెంట్ సభ్యుడు. ఇతను లాయర్ కూడా. 'ఖతర్ సుల్తాన్ తరఫున వరల్డ్ కప్ ట్రోఫీ నెగ్గినందుకు నేను శుభాకాంక్షలు తెలుపుతున్నా. బంగారం, నలుపు రంగులో ఉన్న అరబిక్ బిష్త్ శౌర్యానికి, తెలివితేటలకు ప్రతీక. అందుకు నీకు 10 లక్షల డాలర్లు ఇస్తున్నాను' అంటూ అహ్మద్ ట్వీట్ చేశాడు. అరబ్ దేశాల్లో మగవాళు పెళ్లిళ్లు, మతపరమైన పండుగల వేళ అలాంటి కోటు వేసుకుంటారు.

# సెకండ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్స్ ఫెయిల్



ఢాకా,డిసెంబర్24(సమసమాజం): రెండో ఇన్నింగ్స్‌లో భారత జట్టు కష్టాల్లో పడింది. వాల్ పూజారా 6 పరుగులకే రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. మెహిదీ హసన్ మిరాజ్ వేసిన 7వ ఓవర్ తొలి బంతికి పూజారా స్టంప్ అవుట్ అయ్యాడు. దాంతో, అక్షర్ పటేల్ నైట్ వాచ్‌మెన్‌గా క్రీజులోకి వచ్చాడు. అంతకుముందు రెండో ఓవర్‌లోనే కెప్టెన్ కేఎల్ రాహుల్ అవుట్ అయ్యాడు. షకిబుల్ హసన్ బౌలింగ్‌లో నురుల్ హసన్ క్యాచ్ పట్టడంతో రాహుల్ పెవిలియన్ బాట పట్టాడు. ఇంకా 13 ఓవర్ల ఆట మిగిలి ఉంది. దాంతో, అక్షర్ (9) , శుభ్‌మన్ గిల్ (7) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతున్నారు. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే భారత్ 121 పరుగులు చేయాలి. చేతిలో 8 వికెట్లు ఉన్నాయి. బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 231 రన్స్‌కే పరిమితమైంది. దాంతో 144 పరుగుల ఆధిక్యం సాధించింది. భారత్‌కు 145 పరుగుల టార్గెట్ విధించింది. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ మూడు వికెట్లతో బంగ్లాను దెబ్బతీశాడు. బంగ్లా బ్యాటర్లలో ఓపెనర్ జకిర్ హసన్ (51), లిట్టన్ దాస్‌లు (73) హాఫ్ సెంచరీతో రాణించారు.


# చీఫ్ సెలెక్టర్‌గా మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది

**పాక్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయం**



లాహోర్,డిసెంబర్24(సమసమాజం): మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది పాక్ చీఫ్ సెలెక్టర్‌గా నియామకమయ్యాడు. వసీం అబ్బాసీ స్థానంలో పీసీబీ అఫ్రిదిని తాత్కాలిక చీఫ్ సెలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం పాక్ క్రికెట్‌లో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల కిందట పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ రమీజ్ రాజాపై ప్రభుత్వం వేటు వేసింది. ఆ తర్వాత నజామ్ సేథీ పీసీబీ చైర్మన్‌గా నియామకమయ్యారు. ఇటీవల స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో పాక్ 0–3 తేడాతో ఓటమిపాలైంది. ఆ తర్వాత విమర్శలు వెల్లువెత్తగా.. క్రికెట్ బోర్డులో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతానికి అఫ్రిది సెలెక్టర్‌గా వ్యవహరించనుండగా.. శ్వాత చీఫ్ సెలెక్టర్‌ను ఎంపిక చేయనున్నారు. ఇదిలా ఉండగా.. యాషెస్‌లో ఇంగ్లండ్ జట్టు ఘోర ఓటమి తర్వాత ఈసీబీ బోర్డులో అనేక మార్పులు జరిగాయి. బ్రెండన్ మెకల్లమ్ జట్టుకు కొత్త కోచ్‌గా నియామకమయ్యాడు. అప్పటి నుంచి ఇంగ్లండ్ జట్టు అద్భుతాలు చేస్తున్నది. ఈ క్రమంలోనే పీసీబీ సైతం అదే పద్ధతిని అనుసరిస్తున్నది. షాహిద్ అఫ్రిదీతో పాటు అబ్దుల్ రజాక్, రావ్ ఇఫ్తికర్ అంజుమ్ సైతం సెలక్షన్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. పాత సెలక్షన్ కమిటీ ఎంపిక చేసిన జట్టును సమీక్షించి సరైన ఆటగాళ్లను ఎంపిక చేయకుంటే మార్పులు చేసేందుకు కొత్త సెలక్షన్ కమిటీకి పీసీబీ తొలి బాధ్యతను అప్పగించింది. ఈ జట్టు న్యూజిలాండ్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్‌లో ఆడనున్నది. ఈ సందర్భంగా పీసీబీ చైర్మన్ నజామ్ సేథీ మాట్లాడుతూ అఫ్రిది దూకుడైన క్రికెటరని, దాదాపు అతనికి 20 ఏళ్ల ఆట ఆడిన అనుభవం ఉందన్నారు. ప్రతిభ ఉన్న యువ ఆటగాళ్లకు మద్దతు ఇచ్చాడని, పాక్‌కు ఆడేందుకు ఉత్తమ జట్టును ఎంపిక చేయడంలో సహకారం అందిస్తాడన్నారు. పీసీబీ అప్పగించిన బాధ్యతలను గౌరవంగా భావిస్తున్నట్లు అఫ్రిది చెప్పాడు. న్యూజిలాండ్‌తో జరిగే సిరీస్‌కు బలమైన జట్టును ఎంపిక చేస్తామని, ఇందు కోసం త్వరలోనే సెలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపాడు.

# చలన చిత్రం



# వరుణ్ ధావన్ ప్రాజెక్టుకు దూరంగా సమంత

సమంతా అనారోగ్యం కారణంగా ఒక్కో ప్రాజెక్ట్ చేజార్చుకుంటుందా? మరో నెల రోజుల్లో కోలుకోకపోతే మరిన్ని ప్రాజెక్ట్ ల నుంచి ఉద్వాసన తప్పదా? అంటే అవుననే ప్రచారం బాలీవుడ్ మీడియాలో జోరుగా సాగుతోంది. వాస్తవానికి ఈ రకమైన కథనాలు ఇప్పటికే వెలువడ్డాయి. అయితే వాటిని సమంత సన్నిహిత వర్గాలు ఖండించాయి. కానీ తాజా సన్నివేశం మరోలా కనిపిస్తుంది. ఇటీవలే సమంత నటించాల్సిన 'సీటాడెల్' ఇండియన్ వెర్షన్ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ విషయాన్నిఅమెజాన్ ప్రైమ్ ట్విటర్లో ప్రకటించింది. ఆ సంస్థ ఇచ్చిన జాబితాలోఎక్కడా సమంత పేరు కనిపించలేదు. వాస్తవానికి ఇందులో వరుణ్ ధావన్కి జోడీగా సమంత నటించాలి. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహిస్తోన్న క్రేజీ వెబ్ సిరీస్ ఇది. అమ్మడికి ఫ్యామిలీ మ్యాన్-2 తర్వాత వచ్చిన వెబ్ అవకాశం కావడంతో! ఎంతో సంతోషంగా సంతకం చేసింది. కానీ తాజాగా అమెజాన్ ట్వీట్ చూసిన తర్వాత ప్రాజెక్ట్ నుంచి ఆమె తప్పుకుందని వార్తలొస్తున్నాయి. అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకోవడంతో ఆమె స్థానంలోమరో హీరోయిన్ ని తీసుకుని ముందుకెళ్తున్నట్లు ప్రచారం సాగుతోంది. సమంత తప్పుకుందని అధికారిక ప్రకటన లేనప్పటికీ సన్నివేశాలు అలాగే కనిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో మరో వార్త కూడా తెరపైకి వస్తుంది. బాలీవుడ్ లో సమంత నటించాల్సిన ఓ సినిమా నుంచి కూడా ఉద్వాసన ఎదురైనట్లు సమాచారం. ఆ సినిమా షూటింగ్ జనవరిలో మొదలు పెట్టడానికి రెడీ అవుతున్నారుట. ఈ నేపథ్యంలో సమంత ఇప్పట్లో తమతో కలవడం కష్టమని భావించి సదరు సంస్థ ఆమెని తప్పించినట్లు ప్రచారం సాగుతోంది. మరోవైపు సమంత కోసం నిర్మాతలంతా వెయిట్ చేస్తున్నారని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కానీ మీడియా కథనాలు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మరి సీటాడెల్ నుంచి తప్పుకుందా? తప్పించారా? అసలేం జరుగుతోంది అన్నది క్లారిటీ రావాలంటే సమంత లైన్లోకి రావాలి. జనవరి నుంచి 'ఖుషీ' షూటింగ్ కి హాజరవుతుందని మరోవైపు జోరుగా ప్రచారం సాగుతోన్న సంగతి తెలిసిందే.





## రెండు భాగాలుగా ప్రభాస్ సలార్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం మూడు భారీ క్రేజీ సినిమాల్లో నటిస్తున్నారు. నాలుగు పాన్ ఇండియా ప్రాజెక్ట్ లలో ఇప్పటికే 'ఆది పురుష్' పూర్తయి వీఎఫ్ ఎక్స్ వర్క్ దశలో వుండటంతో ప్రభాస్ మిగతా మూడు సినిమాలని పూర్తి చేసే పనిలో వున్నాడు. ఇందులో 'కేజీఎఫ్' డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మూవీ 'సలార్' కూడా వుంది. కోల్ మైన్స్ నేపథ్యంలో కేజీఎఫ్ తరహా థీమ్ తో ఈ మూవీని ప్రశాంత్ నీల్ అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నాడు. హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ మూవీని 'కేజీఎఫ్' మల్టీవర్స్ లో భాగంగా తెరకెక్కిస్తున్నాడనే వార్తలు గత కొంత కాలంగా వినిపి స్తున్నాయి. అంతే కాకుండా ఈ మూవీని కూడా 'కేజీఎఫ్' తరహాలో రెండు భాగాలుగా రిలీజ్ చేయబోతు న్నారని తాజాగా ఓ క్రేజీ అప్ డేట్ నెట్టింట వైరల్ గా మారింది. ఈ వార్త ప్రభాస్ ఫ్యాన్స్‌ని మరింతగా ఆకట్టుకుంటూ ఈ ప్రాజెక్ట్ పై భారీ అంచనాల్ని క్రియేట్ చేస్తోంది. శృతిహాసన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలోని కీలక పాత్రల్లో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ జగపతిబాబు మధు స్వామి ఈశ్వరీ రావు శ్రియారెడ్డి నటిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ మూవీ షూటింగ్ దాదాపుగా 85 శాతం పూర్తయింది. ఈ మూవీ సీక్వెల్ పై ÷నైల్ కట్ చూశాకే మేకర్స్ నిర్ణయం తీసుకోనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. 'కేజీఎఫ్' మూవీకి ఇదే పంథాని అనుసరించిన మేకర్స్ 'సలార్' విషయంలోనూ అదే ఫాలో కావాలనుకుంటున్నారట. ఇదే విషయాన్ని ఇటీవల ఓ మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడుతూ నిర్మాత విజయ్ కిరగందూర్ స్పష్టం చేసినట్టుగా తెలుస్తోంది. రాబోయే ఐదేళ్లలో ఇండియన్ సినీ పరిశ్రమలో భారీ పెట్టుబడులు పెట్టబోతున్నామని ప్రకటించిన విజయ్ కిరగందూర్ పలు సీక్వెల్స్ గురించి ఆలోచిస్తున్నామని ఇందులో తాజా హిట్ సినిమాకు సంబంధించిన సీక్వెల్ ఉంటుందని స్పష్టం చేశారు. కానీ 'సలార్' సీక్వెల్ వుంటుందా? ..ప్రస్తుతం సైమల్ టెనియస్ గా సీక్వెల్ షూటింగ్ ని చేస్తున్నామనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. దీంతో 'సలార్' సీక్వెల్ ని అభిమానులని సర్ ప్రైజ్ చేస్తూ ప్రకటించే అవకాశం వుందనే వాదన వినిపిస్తోంది.



## సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లంటే చులకనా: నయన్

సౌత్ లో నయనతార క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ముఖ్యంగా తెలుగు.. తమిళ్ భాషల్లో పెద్ద స్టార్. టాలీవుడ్ సినిమాలు రేర్ గా చేసినా ఇక్కడ అమ్మడికి ఉన్న ఫాలోయింగ్ మాత్రం వెరీ స్పెషల్. సౌత్ లో అత్యధిక పారితోషికం తీసుకుంటోన్న హీరోయిన్ ఆమె. అనుష్క.. కీర్తి సురేష్ లాంటి వారు ఎంత మంది పోటికొచ్చినా...ఆమెను కొట్టే సత్తా మాత్రం ఇప్పట్లో ఎవరికీ లేదు. గత కొన్నేళ్లగా టాలీవుడ్ లో చాలా సెలక్టివ్ గా సినిమాలు చేస్తోంది. ఆమెతో నటించాలని చాలా మంది హీరోలు ఆశపడుతున్నా? ఆ ఛాన్స్ మాత్రం అందరికి ఇవ్వదు...కొందరికి మాత్రమే. ఆమె నిర్ణయాలకు దర్శక నిర్మాతలు కూడా కట్టుబడాలి. తను దర్శక.. నిర్మాతలు చెబితే వినే టైప్ కాదు. ఆరకంగా రెండు పరిశ్రమలను నయన్ కొంత కాలంగా శాషిస్తుంది. అందుకే కొన్ని సంవత్సరాలుగా కేవలం నటనకు మాత్రమే పరిమితమైంది. సినిమా ప్రమోషన్లకు మాత్రం హాజరు కానీ ఏకైక హీరోయిన్. ఒక సినిమాకు సంతకం చేసే ముందే ప్రమోషన్ కు రానని కరాఖండీగా చెప్పేస్తుంది. అందుకు నిర్మాత ఒకే అంటేనే సంతకం చేస్తుంది. లేదంటే ఎన్నికోట్లు పారితోషికం ఇస్తామన్నా? ప్రచారం అనేసరికి సారీ చెప్పేస్తుంది. ఎంత పెద్ద హీరో అయినా సరే ప్రమోషన్.. గిమోషన్ అక్కడ జాన్తా నయ్. అయితే ఇలా ప్రమోషన్ కి ఎందుకు ధుమ్మా కొడుతుందని మీడియాలో చాలాసార్లు ప్రచారం సాగింది? ఆమెను నేరుగానూ చాలా మంది అడిగారు. కానీ ఇంతవరకూ ఎక్కడా ఆ విషయం చెప్పలేదు. అయితే తాజాగా ఓ తమిళ ఇంటర్వ్యూలో ఇదే ప్రశ్న ఎదురైతే? సినిమా ఇండస్ట్రీని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇండస్ట్రీలో హీరోయిన్లకు విలువ లేదు. చాలా కాలం పాటు వాళ్లకి ఓ విలువ ఉంటుందని భావించా . కొంత కాలం చూసా. కానీ అది జరిగే పని కాదని అర్థమైంది. అప్పటి నుంచి సినిమా ప్రమోషన్లకు రావడం మానేసా. ఇది నేను బలంగా తీసుకున్న ఓ గీత' అనేసింది. దీంతో కొన్ని తరకాల కథనాలికి నయన్ ఆ రకంగా చెక్ పెట్టింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in